

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో జిల్లాకు 12వ ర్యాంకు

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై 14 సూచీల ఆధారంగా కూటమి ప్రభుత్వం శుక్రవారం జిల్లాలకు రాష్ట్రస్థాయి ర్యాంకులను ప్రకటించింది. ఈ ర్యాంకుల్లో అనకాపల్లి జిల్లాకు 12వ స్థానం దక్కింది. పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, పంచాయతీరాజ్ శాఖ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణకు 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్‌కు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్‌కు 10 పాయింట్లు, నూరు శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్‌కు 10 పాయింట్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌కు 20 పాయింట్లు చొప్పున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు కేటాయించింది. రాష్ట్రస్థాయిలో అనకాపల్లి జిల్లాకు 113 పాయింట్లు దక్కడంతో 12వ స్థానంలో నిలిచింది.

## ఇంటర్, టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

-వార్త 8వ పేజీలో

## మంచుతో మామిడి, జీడిమామిడికి తెగుళ్లు

- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి సూచన

-వార్త 8వ పేజీలో

## దామోదరం సంజీవయ్యకు ఘన నివాళులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొని, సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దామోదరం సంజీవయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జేసీ జాహ్నవి, బీసీ సంక్షేమ అధికారిణి రాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కొండకొప్పాకలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ దేవప్రసాద్ పాల్గొని సంజీవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



సంజీవయ్య చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

# తాగునీటి వనరులకు మరమ్మతులు

## సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ కింద వేగంగా పనులు

- వచ్చే నెల 15నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశం
- పనిచేయని బోర్లను వినియోగంలోకి తెస్తున్న సిబ్బంది
- తాగునీటి పథకాలు, పైపులైన్లకు మరమ్మతులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**రానున్న వేసవిలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా వుండేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ కింద బోర్లు, రక్షిత తాగునీటి పథకాలకు మరమ్మతులు చేస్తున్నారు. వచ్చే నెల 15వ తేదీలోగా ఈ పనులన్నీ పూర్తిచేసేలా కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు.**

గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారు రికార్డుల ప్రకారం జిల్లాలో 16,059 చేతి బోర్లు, 1,850 పీడబ్ల్యూఎస్‌పైపుల ద్వారా నీటిని సరఫరా చేసే (పీడబ్ల్యూఎస్) పథకాలు, 28 సమగ్ర రక్షిత తాగునీటి (సీపీడబ్ల్యూ) పథకాలు వున్నాయి. వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని, ఈ నెల ఒకటో తేదీ నుంచి సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీడీఓల పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లో ప్రత్యేక బృందాలు పర్యటించి తాగునీటి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. తాగునీటి బోర్లు పనిచేస్తున్నాయా? లేదా? అన్నది పరిశీలిస్తున్నారు. ఒకవేళ బోరు పనిచేయకపోతే సమస్య ఏమిటో గుర్తిస్తున్నారు. పూడిక పేరుకుపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల నీరు రాకపోతే బోరుకు ఫ్లష్ చేయించి, మరింత లోతు తవ్విస్తున్నారు. పైపులు తుప్పుపడితే వాటిని మారుస్తున్నారు. ఇంకేమైనా మరమ్మతులు వుంటే పూర్తిచేసి బోరు నుంచి నీరు వచ్చేలా చర్యలు చేపడతున్నారు. రక్షిత ట్యాంకులను పరిశీలించి, అవసరమైతే మరమ్మతు పనులు చేస్తున్నారు. తుప్పు పట్టిన, విరిగిన పైపుల స్థానంలో కొత్తవాటిని అమర్చుతున్నారు. జిల్లా అధికారులు ఆదేశించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ కింద మరమ్మతు పనులన్నీ వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తిచేయాలని మండలస్థాయి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

# చోద్యం హైస్కూల్‌లో కీచక పీఈటీ

## చెన్నైలో ఆటల పోటీలకు వెళ్లినప్పుడు బాలికల పట్ల అసభ్యకర ప్రవర్తన

- పక్షం రోజుల క్రితం ఘటన
- సోషల్ మీడియా ద్వారా ఆలస్యంగా వెలుగులోకి
- స్పందించిన విద్యా శాఖ అధికారులు
- పాఠశాలలో ఎంఈవోలు విచారణ
- బాలికల నుంచి వాంగ్మూలం నమోదు
- పీఈటీపై తదుపరి చర్యల కోసం డీఈవోకు నివేదిక

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

**గొలుగొండ మండలం చోద్యంలోని జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలపట్ల కాంట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) అసభ్యకరంగా ప్రవర్తించాడు. సుమారు రెండు వారాల క్రితం జరిగిన ఈ సంఘటన గురించి శుక్రవారం ఉదయం సోషల్ మీడియాలో రావడంతో విద్యా శాఖ అధికారులు స్పందించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవోలు చోద్యం పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడుపై తదుపరి చర్యల నిమిత్తం నివేదికను డీఈవోకు పంపారు. ఇందుకు సంబంధించి ఎంఈవోలు తెలిపిన వివరాలిలా వున్నాయి.**



పీఈటీ కె.నూకరాజు (ఫైల్ ఫొటో)

జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నైలో జరిగిన జాతీయస్థాయి లంగడీ ఆటల పోటీలకు పీఈటీ కుందూరు నూకరాజు ఆధ్వర్యంలో 11 మంది (ఆరుగురు బాలికలు, ఐదుగురు బాలురు) విద్యార్థులు హాజరయ్యారు. సుదూర ప్రాంతంలో జరిగే ఆటల పోటీలకు బాలికలు వెళుతున్నప్పటికీ హెచ్ఎం శ్రీనివాసరావు ఒక్క మహిళా టీచర్‌ను కూడా వారి వెంట పంపలేదు. కాగా ఆటల పోటీలకు వెళ్లిన సమయంలో పీఈటీ నూకరాజు, కొంతమంది బాలికలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. కానీ ఈ విషయం బయటకు పొక్కలేదు. అయితే శుక్రవారం ఓ వ్యక్తి ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది వైరల్‌గా మారడంతో జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో-1 ఒ.సత్యనారాయణ, ఎంఈవో-2 మూర్తి, ఇతర అధికారులు చోద్యం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. క్రీడా పోటీలకు వెళ్లి వచ్చిన బాలికలతో విడివిడిగా మాట్లాడి వివరాలు సేకరించారు. అంతేకాక వారి నుంచి లిఖితపూర్వంగా వాంగ్మూలం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ, పీఈటీ తమపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరుగురు బాలికలు ఫిర్యాదు చేశారని చెప్పారు. విచారణ నివేదికను డీఈవో అప్పారావునాయుడుకు పంపుతున్నామని, పీఈటీపై తగు చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు.

# జంపపాలెం రేషన్ డీలర్‌పై వేటు

## ఎండీయూ ఆపరేటర్‌పైనా చర్యలు

- ఇద్దరినీ సస్పెండ్ చేయాలని జేసీ జాహ్నవి ఆదేశాలు
- రేషన్ బియ్యంలో రాళ్లు, ఎలుకల వ్యర్థాలపై 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక
- రేషన్ డిపోను తనిఖీ చేసి, కార్డుదారులతో మాట్లాడిన జేసీ
- పర్యవేక్షణ లేదంటూ పౌరసరఫరాల శాఖ అధికారులపై ఆగ్రహం



జంపపాలెం డిపోలో రేషన్ బియ్యాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ఎలమంచిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

**మండలంలోని జంపపాలెంలో రేషన్ కార్డుదారులకు రాళ్లు, ఎలుకల వ్యర్థాలు వున్న బియ్యం పంపిణీ చేయడాన్ని జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణించారు. జాయింట్ కలెక్టర్ స్వయంగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. బాధ్యులైన రేషన్ డీలర్, ఎండీయూ వాహనం డ్రైవర్లను సస్పెండ్ చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

పౌర సరఫరాల శాఖ అధికారులు ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో రాళ్లు, ఎలుకల పెంటికలు వస్తున్నాయని ఎలమంచిలి మండలం జంపపాలెం గ్రామస్థులు ఆరోపించారు. గత కొన్ని నెలలుగా ఇదే విధమైన బియ్యం అందజేస్తున్నారని, రేషన్ డీలర్లకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. అంతేకాక గ్రామానికి చెందిన దేవకీనాయుడు అనే వ్యక్తి ఏకంగా మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎలమంచిలి పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు కె.నూకరాజు, ఆర్ఐ విష్ణు గురువారం జంపపాలెం వెళ్లి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. ఈ వ్యవహారంపై 'రేషన్ బియ్యంలో రాళ్లు, ఎలుకల వ్యర్థాలు' అన్న శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తతో జిల్లా అధికారులు స్పందించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి శుక్రవారం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి, తహసీల్దారు వరహాలు, ఇతర అధికారులతో కలిసి జంపపాలెం వచ్చారు. రాళ్లు, ఎలుకల వ్యర్థాలతో వున్న బియ్యం పంపిణీ ... మిగతా 8వ పేజీలో

# డీసీసీబీలో నిధులు గోల్‌మాల్

## బినామీ పేర్లతో రుణాల మంజూరు

- తక్కువ విలువగల బంగారం వస్తువులపై పరిమితికి మించి రుణాలు
- 'టెక్నికల్ రైటాఫ్' పేరుతో అప్పులు మాఫీ
- భారీ మొత్తంలో నిధులు స్వాహా చేసినట్టు ఆరోపణలు
- కలెక్టర్లకు ఎమ్మెల్యే సుందరపు, వ్యవసాయదారుల సంఘం నేత విల్లూరి పైడారావు ఫిర్యాదులు
- విచారణ జరిపించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో అవినీతి తీగ లాగితే డొంక కదులుతోంది. గత వైసీపీ పాలనలో గుట్టుగా సాగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అధికారం చేతలో వుండడంతో డీసీసీబీ నిధులు భారీ మొత్తంలో బొక్కేశారు. పీఏసీఎస్‌లు రైతులకు ఇవ్వాల్సిన రుణాలు పక్కదారి పడుతున్నాయంటూ గతంలో అనేక ఫిర్యాదులు అందినా.. నాటి వైసీపీ విచారణకు ఆదేశించలేదు. పైగా ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు.**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు గత ఏడాది అక్టోబరులో విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్లు, ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ముగ్గురు సహకార అధికారులను విచారణ అధికారులుగా నియమించారు. డీసీసీబీలో అవకతవకలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. డీసీసీబీ బ్రాంచీలు, పీఏసీఎస్‌ల ద్వారా రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై సమాచారం సేకరించినట్టు తెలిసింది. అప్పట్లో డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన వైసీపీ నేత, డీసీసీబీ ఉన్నతాధికారి కుమ్మక్కై బినామీ పేర్లతో వ్యవసాయ రుణాలు మంజూరు చేసినట్టు రికార్డుల్లో చూపి అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. తరువాత 'టెక్నికల్ రైటాఫ్' పేరుతో డీసీసీబీ జనరల్ బాడీ సమావేశంలో ఆమోదింపజేసుకుని, రుణాలను రద్దు చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను కూడా ఇదే తరహాలో తీసుకుని, 'టెక్నికల్ రైటాఫ్' పేరుతో రద్దు చేయించినట్టు తెలిసింది.

ఇక బంగారు ఆభరణాలపై రుణాల మంజూరు విషయంలోనూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్టు సమాచారం. తక్కువ విలువ చేసే వస్తువులు, ఆస్తులను బ్యాంకులో కుదవపెట్టుకుని అధిక మొత్తం రుణాలు మంజూరు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహా రుణాల మంజూరు నర్సీపట్నం, ఎలమంచిలి పరిధిలో ఎక్కువగా జరిగినట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిపై స్పందించిన కూటమి ప్రభుత్వం సహకార శాఖ, డీసీసీబీలో జరిగిన అక్రమాలపై విచారణను వేగవంతం చేసినట్టు తెలిసింది. ఇప్పటికే అనకాపల్లి జిల్లా సహకార శాఖ కార్యాలయంలో ఆడిట్ అధికారిపై వేటు వేసిన ప్రభుత్వం, వైసీపీ జమానాలో జరిగిన అవినీతి, అక్రమాల గుట్టువిప్పాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీసీసీబీ నాటి చైర్మన్, సీఈవోలకు జారీచేసేందుకు నోటీసులను సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.



విశాఖలో డీసీసీబీ ప్రధాన కార్యాలయం

# నర్సీపట్నంలో ముగ్గురి అదృశ్యం

**అంతా ఒకే కుటుంబ సభ్యులు**

- 8వ తేదీ నుంచి కానరాని ఆచూకీ
- దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):

**అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కాపు వీధిలో నివాసం ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమయ్యారు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.**

నర్సీపట్నం మండలం నీలంపేటకు చెందిన బట్ట రాణి, తల్లి చక్రమ్మ, పెద్ద కుమారుడు రాజేశ్, చిన్న కుమారుడు మోహన్‌తో కలిసి నర్సీపట్నం కాపువీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు రాజేశ్ తోపుడు బండిపై ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకునేవాడు. చిన్న కుమారుడు మోహన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రెండు నెలలుగా టీ దుకాణం నడుపుతున్నాడు. రాజేశ్ సుమారు రూ.10 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఆ విషయం కుటుంబ సభ్యులెవరికీ తెలియదు. అయితే ఫ్యాన్సీ సామగ్రి అమ్మకం లాభసాటిగా లేదని, టీ టైమ్ షాపులోనే తినుబండారాలు అమ్ముకుంటానని తమ్ముడు మోహన్‌తో అనడంతో ఇద్దరు కలిసి వ్యాపారం చేసుకుందామని అనుకున్నారు. మోహన్ షాపులో పెట్టుబడి పేరుతో ఈ నెల 6వ తేదీన తెలిసిన వారి దగ్గర రాజేశ్ మరో రూ.50 వేలు అప్పు చేశాడు. ఈ విషయం తెలిసి...ఆ డబ్బులు ఏమయ్యాయని మోహన్ ఈ నెల ఏడో తేదీన అన్నను నిలదీశాడు. పాత అప్పులకు వడ్డీల కింద కట్టేశానని రాజేశ్ చెప్పాడు. అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం మోహన్ నీలంపేటలోని సొంతింటికి వెళ్లిపోయాడు. ఉదయం సెల్ ఫోన్ చూసే సరికి ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్టు రాజేశ్ పెట్టిన మెసేజ్‌లు చూసి ఆందోళన చెందాడు. ఈ నెల 8న ఉదయం కాపువీధిలోని ఇంటికి వచ్చి చూస్తే తల్లి రాణి, అమ్మమ్మ పెనుమచ్చు చక్రమ్మ, అన్నయ్య రాజేశ్ కనిపించలేదు. బంధువులకు రెండు రోజులుగా ఫోన్లు చేసి వాకబు చేశాడు. ఆచూకీ లేకపోవడంతో ఈ నెల పదో తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేశ్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా విచారణ చేస్తున్నామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. నాతవరం మండలం ఎంబీ పట్నం ఏలేరు కాలువ వద్ద చివరిగా సిగ్నల్స్ కనిపించాయన్నారు. అన్ని వాట్సాప్ గ్రూపుల్లో ముగ్గురి ఫొటోలు పెట్టినట్టు ఆయన చెప్పారు. ఏడు రోజులుగా తల్లి, అమ్మమ్మ, అన్నయ్య ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనగా ఉందని మోహన్ వాపోయాడు.



బట్ట రాజేశ్



రాజేశ్ తల్లి రాణి



పి.చక్రమ్మ

## ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న శివదీక్ష చేపట్టిన భక్తులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంజేపురంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

## పాఠశాలల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ఎలమంచిలి బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులతో విజయ్ గౌరి

ఎలమంచిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలలకు యూటీఎఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులతో కలిసి వెళ్లి ఉపాధ్యాయులను కలిశారు. బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ఎస్ రోడ్డు స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ అంతా తనకు మద్దతు ప్రకటించాలన్నారు. విద్యారంగం పరిరక్షణతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలతో మురుగు సమస్య పరిష్కారం

▸▸ డ్వామా పీడీ పూర్ణిమాదేవి

మునగపాక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి సూచించారు. మండలంలోని గొల్లలపాలెం, వాడ్రాపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైనేజీలు లేని కారణంగా ఇళ్ల ముందు మురుగు తిష్ట వేస్తుండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దీని వలన అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇంకుడు గుంతల పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అదే విధంగా ఈ-శ్రమ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మణికుమార్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పారాయుడుపాలెం రోడ్డుపై అవస్థలు

▸▸ ఎక్కడికక్కడ రాళ్లు తేలి, గుంతలు ▸▸ గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ▸▸ కూటమి పాలకులైనా స్పందించాలని వేడుకోలు

రాంబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రాంబిల్లి నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలోని జంగాలపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడు పాలెం వరకు రహదారి దారుణంగా మారింది. రాళ్లు తేలి, ఎక్కడికక్కడ గోతులు పడడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డులో ప్రతిరోజూ రాంబిల్లి పరిసర ప్రాంతాలకు చెందిన వారితోపాటు, ఎస్ఈజెడ్‌లోని గ్రామాల ప్రజలు ఎలమంచిలికి దగ్గరమార్గం కావడంతో రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు





అస్తవ్యస్తంగా మారిన అప్పారాయుడుపాలెం రోడ్డు

మూడు కిలోమీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డులో అడుగడుగునా భారీగా గోతులు పడ్డాయి. అలాగే, రోడ్డు పొడవునా కోతకు గురై రాళ్లు తేలడంతో రూపు మారింది. ఇటువంటి రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఇక వర్షా కాలంలో అయితే అవస్థలు వర్ణనాతీతంగా ఉంటాయని చెపుతున్నారు. ఆ సమయంలో గుంతల్లో నీరు చేరడం వల్ల రోడ్డు ఎక్కడో, గుంత ఎక్కడో గుర్తించడం కూడా కష్టంగా ఉంటోందని అంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డును బాగుచేయాలని పదేపదే కోరినా పట్టించుకునేవారు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

## 17 నుంచి రామలింగేశ్వర ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు

▸▸ భారీ ఏర్పాట్లు చేపడుతున్న నిర్వాహకులు

▸▸ ఆలయానికి వెళ్లే రహదారికి చకచకా మరమ్మతులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తపేటలో చారిత్రాత్మక పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమానికి జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో మరమ్మతు పనులను మునిసిపల్ అధికారులు ప్రారంభించారు. ఈ ఆలయంలో వేడుకలకు ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ ఆలయ పునః ప్రతిష్ఠా ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యుద్దీపాలంకరణ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ రహదారి అత్యంతదారుణంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ఈ వేడుకతోనైనా రహదారికి మోక్షం లభించిందని అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అధిస్తాన్‌లో ఉద్యోగుల ఆందోళనకు తెర

▸▸ సంస్థ భారత భాగస్వామి దొరస్వామి జోక్యంతో పరిష్కారం

▸▸ రోజుకు అర్ధగంట పని సమయం పెంపు రద్దు

▸▸ భద్రత, భరోసాపై స్పష్టమైన హామీతో అందరిలో ఆనందం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అధిస్తాన్ భారత భాగస్వామి దొరస్వామి జోక్యంతో కర్మాగారంలో పనిచేస్తున్న వేలాది మంది మహిళా ఉద్యోగుల్లో ఆనందం వెల్లువిరిసింది. అరగంట సమయం పెంచి, నెలకు రూ.ఏడు వందల జీతం పెంచుతున్నామని అధిస్తాన్ ప్రతినిధులు ప్రకటించడంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిన విషయం తెలిసిందే. వేధింపులు మానుకోవాలని, జీతాలు పెంచాలని మహిళా ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో దొరస్వామి నెల రోజులు గడువు కావాలని కోరడంతో ఆందోళనను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో దొరస్వామి గతరెండు రోజుల నుంచి అన్ని యూనిట్లలో గల మహిళా ఉద్యోగులతో సమావేశాలు ఏర్పాటుచేసి సమస్యలు తెలుసుకున్నారు. రోజుకు అర్ధ గంట పని సమయం పెంచిన విషయం తనకు తెలియదని, దీనిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, భద్రత, భరోసా ఉంటుందని స్పష్టం



ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న దొరస్వామి

చేశారు. ప్రస్తుతం అక్షయ పాత్ర ద్వారా సరఫరా చేస్తున్న భోజనాలు నచ్చకపోతే మరింత మెరుగైన భోజనాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే లక్ష్యాల పేరుతో ఉద్యోగులకు ఇకపై ఎటువంటి వేధింపులు ఉండవన్నారు. ప్రతి నెలా ఇదే విధంగా ఉద్యోగులతో సమావేశమై సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు. ఇకపై ఏ సమస్య వచ్చినా తన దృష్టి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి దొరస్వామి భోజనం చేశారు.

## నేడు 13 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పదమూడు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ వైర్లకింద పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఈ నేపథ్యంలో అచ్యుతాపురం జంక్షన్, సాయిప్రియ లేఅవుట్, వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మాకాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాల్సిందిగా కోరారు.

## నేడు అభయాంజనేయ తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ) : గోరపూడి పంచాయతీ శివారు అప్పన్నపాలెంలో శనివారం అభయాంజనేయస్వామి తీర్థాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తిచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరగనుంది. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు జరుపుతున్న సిబ్బంది

అచ్యుతాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సురక్ష హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వారపు సంత కావడంతో పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన వారిలో చాలా మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూండ్రపు వెంకునాయుడు, లాలం శ్రీనివాసరావు, ధర్మిరెడ్డి నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

అచ్యుతాపురం, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వైర్ల ద్వారా నిప్పురవ్వలు రాలి వరి కుప్పలతో పాటు ట్రాక్టర్ దగ్ధమైన ఘటనలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. జగ్గన్నపేటలో జరిగిన ఈ ప్రమాదాన్ని తెలుసుకున్న ఆయన శుక్రవారం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దొడ్డి వెంకట కృష్ణ, మల్లరాము, పిన్నమరాజు రవీంద్ర రాజు తదితరులు ఉన్నారు.


## నిర్దేశిత కొలతలతో పనులు చేస్తేనే వేతనాలు



కైలాసపట్నంలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో నాగరాజు

కోటవురట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిర్దశిత కొలతల ప్రకారం పనులు చేస్తేనే వేతనాలు అందుతాయని ఉపాధి హామీ పథకం ఏపీవో నాగరాజు స్పష్టం చేశారు. మండలంలోని కైలాసపట్నంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. కూలీలు చేస్తున్న కందకాలు పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. గ్రూపులు వద్దకు మేట్లు వెళ్లి కూలీలతో పనులు చేయించాలన్నారు. ప్రతీ 50 మంది కూలీలకు ఒక మేటు బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీ జ్యోతి పాల్గొన్నారు.

## కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించరూ...



మాసాహెబ్‌పేటలో సాగునీటి కాలువపై రక్షణ గోడలు లేని కల్వర్టు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో ఊర కాలువపై నిర్మించిన కల్వర్టు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. గ్రామం నుంచి బీసీ కాలనీకి నిత్యం ప్రజలు ఈ కల్వర్టు మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. దీనికి రక్షణ గోడలు నిర్మించలేదు. ఫలితంగా కల్వర్టుపై ప్రయాణం చేసేటపుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పడిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కల్వర్టుపై రక్షణ గోడలు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రాజయ్యపేటలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శివదత్

నక్కపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో నూకతాత సంబరాలను పురస్కరించుకుని నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సివిల్ సప్లయి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నూకతాత పండుగ రోజున విజేతలకు బహుమతులు అందించనున్నట్టు జనసేన నేత పిక్కిస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, జన సైనికులు పాల్గొన్నారు.

# బాలికల వసతి గృహానికి మంచి రోజులు

సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనానికి నిధులు మంజూరు

రూ.17 లక్షలతో ప్రహరీగోడ, మరుగుదొడ్ల మరమ్మతు పనులు

విద్యార్థినులకు తీరనున్న వసతి కష్టాలు

కోటవురట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహం విద్యార్థినులకు త్వరలో కష్టాలు తొలగనున్నాయి. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న భవనాల్లో బిక్కుబిక్కుమంటూ వారు తలదాచుకుంటున్నారు. ఈ దుస్థితికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో చురుగ్గా మరమ్మతు పనులు జరుగుతున్నాయి.

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో ఆరు నుంచి పదో తరగతి 60 మంది వరకు చదువుకుంటున్నారు. ఈ హాస్టల్ భవనం భవనం 42 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వసతిగృహంలో ఆరు గదులు ఉన్నాయి. అయితే నిర్మాణ సమయం నుంచి ఈ భవనం ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ప్రహరీ గోడ ఓ వైపు కూలిపోయింది. దాన్ని పునర్నిర్మించపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. భవనం, డైనింగ్ హాలు, శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం వస్తే నీరు గదులలోకి చీమ్ముతోంది. ఈ దుస్థితిని గమనించిన కూటమి ప్రభుత్వం వసతి గృహాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఇందులో భాగంగా ఈ వసతి గృహం మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, గదుల్లో ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ బాగుచేయడం, తలుపులు కిటికీలు ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నారు. అయితే నిధులు చాలకపోవడంతో శిథిలావస్థలో ఉన్న హాస్టల్ మేట్రిన్ క్వార్టర్‌ను రెండో విడతలో మరమ్మతులు చేయనున్నారు. ఈ విషయంపై హాస్టల్ మేట్రిన్ రాజేశ్వరి వద్ద ప్రస్తావించగా వసతి గృహం, ప్రహరీ గోడ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.17 లక్షలు మంజూరు చేసిందని, ఈ నిధులతో ఇప్పటికే పనులు జరుగుతున్నాయని చెప్పారు.



కూలిపోయిన హాస్టల్ ప్రహరీ గోడ... (ఇన్‌సెట్‌లో) ఊడుతున్న శ్లాబ్ పెచ్చులు

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు ఆరు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత సంజీవయ్యకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య పింఛన్‌లు, అనేక సంక్షేమ పథకాలు రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ కుమారి, ఆర్ అప్పలనాయుడు, గారా ప్రకాశ్, సూరిబాబు పాల్గొన్నారు.

## తుని రైల్వే స్టేషన్‌లో పెదతీనార్ల వాసి మృతి



మృతిచెందిన గోసల అడవిరాజు

పాయకరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం పెదతీనార్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం ఉదయం తుని రైల్వే స్టేషన్‌లో మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలను తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు వెల్లడించారు. తుని రైల్వే స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద శుక్రవారం ఉదయం సుమారు 70 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలనుబట్టి నక్కపల్లి మండలం పెదతీనార్లకు చెందిన గోసల అడవిరాజుగా గుర్తించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబీకులకు తెలియపరిచి, మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ చెప్పారు.

## మాఢవీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం

▸▸ రూ.30 లక్షల వ్యయంతో పనులకు శంకుస్థాపన





రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో మాడవీధుల్లో ఈ ఏడాది స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. హోం మంత్రి అనిత సూచనల మేరకు హెటిరో యాజమాన్యం సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఉపమాక మాడవీధుల్లో సీసీ రహదారుల పనులకు ముందుకొచ్చింది.శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు, రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండబాబు, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, హెటిరో ప్రతినిధులు ఎస్.కుల్లారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎన్.రాజారెడ్డి మాడవీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ బుజ్జి మాట్లాడుతూ మార్చి 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల నాటికి ఈ రహదారి పనులు పూర్తవుతాయని చెప్పారు. సుమారు 650 మీటర్ల పొడవునా మాడవీధుల్లో సీసీ రోడ్లను హెటిరో యాజమాన్యం నిర్మించనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, నాయకులు కె.బుజ్జి, కె.వెంకటరమణ, వరహాలరావు, కనకరాజు, తోట అప్పారావు, తోలేటి శ్రీను,దొరబాబు, వాసు, రవి పాల్గొన్నారు.

## స్కౌట్స్, గైడ్స్‌కు యూనిఫారాల పంపిణీ



విద్యార్థులకు యూనిఫారాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు శుక్రవారం యూనిఫారాలను పంపిణీ చేశారు. పాఠశాలలో హెచ్ఎం పి.జాన్‌ప్రసాద్ వీటిని అందించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడూతూ స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు త్వరలో శిక్షణ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ రమేశ్, ఉపాధ్యాయులు ఎంఎస్ఆర్, వినోద్, రమాదేవి, రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

మండలానికి ఓ పోలింగ్ కేంద్రం

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 1208 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. 12 మండలాలకు మండానికి ఒకటి చొప్పున 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు సెక్టార్లు, ఐదు రూట్లు, ఐదు పోలీస్ రూట్లు, ప్రతీ మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించామని ఆయన తెలిపారు. ఎన్నికల సెక్టార్, రూట్ అధికారులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

## సదరం సర్టిఫికెట్ పరిశీలన చేయించుకోండి

లేనిపక్షంలో పింఛన్ నిలిపివేత: ఎంపీడీవో

మాడుగుల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్‌లను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో పరిశీ లన చేయించుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అర్హత లేనప్పటికీ నకిలీ సదరం సర్టిఫికెట్‌లను చేయించుకుని కొందరు పింఛన్‌లు పొందుతుండడంతో సదరం సర్టిఫికెట్లు ఏరివేతకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పింఛన్ పొందుతున్నవారికి షెడ్యూల్ ప్రకారం అర్హత నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్టు చెప్పారు. పింఛన్ దారులు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. తనిఖీలు చేయించుకోలేని పింఛన్‌లను నిలిపివేయనున్నట్టు ఆయన హెచ్చరించారు.

## దుర్గానగర్‌లో వెండి వస్తువుల చోరీ

రావికమతం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌లోని చందక సత్తిబాబు ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆరు తులాల వెండి వస్తువులు, సాయిబాబా ముడుపుతో ఉన్న డబ్బుల హుండీ పట్టుకుపోయారు. దుర్గనగర్ చర్చికి సమీపంలో ఉన్న సత్తిబాబు ఇంటి తాళాన్ని కట్టర్‌తో కట్ చేసి దొంగతనానికి పాల్పడారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో హెచ్‌సీ వాసు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. చర్చి దగ్గర గల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. చోరీపై బాధితుడు నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎం. రఘువర్మ తెలిపారు.

## రాంకీ వ్యర్థ జలాల చెరువును మూసివేయాలి

» సచివాలయం ఎదుట తానాం గ్రామ రైతులు ఆందోళన



తానాం సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాంకీ యాజమాన్యం వ్యర్థ జలాలను నిల్వ చేసేందుకు అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ తానాం గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం స్థానిక సచివాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ జలాలను ఈ చెరువులో నిల్వ చేయడం వలన భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. ఇదే విషయాన్ని ఎన్‌జీటీలో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం కేసు నడుస్తోందన్నారు. స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ చెరువును మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వర్రి సన్యాసిరావు, కన్నంనాయుడు, వెంకునాయుడు, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కోదండ సీతారామాలయంలో గండి బాబ్జీ పూజలు


బాబ్జీని సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న సర్పంచ్ లావణ్య తదితరులు

సబ్బవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బంగారమ్మపాలెంలో నిర్మించిన కోదండ సీతారామాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈనెల ఎనిమిదో తేదీ నుంచి దివ్యనామ సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు శుక్రవారం పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, ఆయన కుమారుడు వంశీదీప్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాజు కోటి, సూనిశెట్టి సూర్యనారాయణ, దాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పెంపు తగదు



ఎల్ఐ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

కొత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వంద శాతానికి పెంచడం వలన భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరదని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యుడు పి.ఎస్.సుబ్బారావు అన్నారు. దీనివల్ల బీమా పొందుతున్న ప్రజలకు కూడా ఎలాంటి మేలు ఉండదన్నారు. శుక్రవారం ఇక్కడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితి 74శాతం ప్రైవేటు రంగవృద్ధికి, విస్తరణకు ఏమాత్రం అడ్డంకి కాదని పేర్కొన్నారు. ఇటువంటి సందర్భంలో డబ్బైనాలుగు శాతం నుంచి వంద శాతం పెంచడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే ఈ పెంపును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు మళ్ల చంద్రశేఖర్, వి.ఎస్.కె.హరినాథ్, జగదేశ్వరరావు, జంపా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## '25లోగా భూముల వివరాలు నమోదు చేసుకోండి'


తేగాడలో పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

కశింకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తేగాడ, పేరంటాలపాలెం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. ఈ నెల 25లోగా భూ ఆధార్ కార్డుకు పోర్టల్‌లో రైతుల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలను తీసుకునేందుకు వీలు ఉంటుందని తెలియజేశారు. అలాగే పంటల సాగులో ఎటువంటి సందేహాలున్నా వ్యవసాయ క్షేత్రాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్వప్న, వ్యవసాయ క్షేత్రం సిబ్బంది పాల్గొన్నారు.

# భవిత కేంద్రానికి రక్షణ కరువు

» రాత్రి వేళల్లో ఆకతాయిలు హల్‌చల్ » ఇప్పటికే పలు సామగ్రి చోరీ » సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే » పిల్లలను చదువులకు పంపించాలంటే తల్లిదండ్రులు హడల్

కశింకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో గల భవిత కేంద్రానికి రక్షణ కరువైంది. సాధారణ విద్యార్థుల కంటే మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టేవారు లేకపోవడంతో అయా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఇక్కడున్న నెంబరు-2 పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులతో విద్య


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తలుపు


కశింకోటలోని భవితా కేంద్రం

నందిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి పది వరకు మొత్తం ఇరవై మంది విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. వీరికి సరైన వసతి సౌకర్యం లేదు. ప్రధాన గేటును ఏర్పాటు చేయడంతో పాటు ఆరుబయటకు వెళ్లకుండా గిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టేవారు కరువయ్యారు. దీంతో పిల్లలు పాఠశాలకు వచ్చింది మొదలు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు నిత్యం టెన్షన్‌కు గురవుతున్నారు. ఇదిలావుంటే, ఇక్కడ తాగునీటి సమస్య నెలకొంది. సమీపంలో ఉన్న హైస్కూల్ నుంచి బిందెతో నీటిని తెచ్చి పెడుతున్నారు. పాఠశాలలో ఫ్రెండ్లీ టాయిలెట్స్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఆకతాయిలు స్కూల్‌లోకి ప్రవేశించి ప్రధాన తలుపులను ధ్వంసం చేశారు. ఫ్యాను, ఇతర సామగ్రిని దొంగలించుకుపోయారు. అప్పటి నుంచి స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఉంచాలంటే భయం వేస్తోందని సిబ్బంది చెపుతున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా తలుపులు ఏర్పాటు చేసుకొని పాఠశాలను నిర్వహిస్తున్నారు. శాశ్వతమైన ఇనుప గేటును ఏర్పాటు చేస్తే కొంత వరకు పాఠశాలకు భద్రత చేకూరుతుందని అంటున్నారు. దివ్యాంగ విద్యార్థుల కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తక్కువే అయినప్పటికీ వీరిపట్ల అధికారులు ఇంతలా నిర్లక్ష్యం చూపడం తగదని పలువురు వాపోతున్నారు. విద్యా బోధనకు అవసరమైన ప్రత్యేక పరికరాలు సైతం లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఆకతాయిలు రాత్రి వేళల్లో హల్‌చల్ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### పిల్లల ఆటలకు సరైన పరికరాలు లేవు



మా బాబు భవిత కేంద్రంలో పదో తరగతిలో ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం తనతో పాటే ఉంటున్నాను. పాఠశాలలో తాగునీటి సమస్య ఉంది. విద్యార్థులు చక్కగా ఆడుకునేందుకు సరైన పరికరాలు లేవు. ఫ్రెండ్లీ టాయిలెట్స్ కూడా లేవు. ఫిల్టర్ వాటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. తాగునీటిని ఇక్కడి సమీపంలో ఉన్న హైస్కూల్ నుంచి బిందెతో తీసుకువస్తున్నారు. తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి.

- సిహెచ్.నాగమణి, విద్యార్థి తల్లి, కశింకోట

# ఆదర్శనీయుడు దామోదరం సంజీవయ్య

» జయంత్యుత్సవంలో కీర్తించిన వక్తలు


సంజీవయ్య చిత్రపటం వద్ద జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్ నివాళి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దామోదరం సంజీవయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య పనిచేయడం గర్వకారణమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో అనేక పదవులు చేపట్టి దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారిణి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి తదితరులు పాల్గొన్నారు.



కొప్పాకలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో దామోదర సంజీవయ్య జయంతి నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ దేవప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు సంజీవయ్య అని పేర్కొన్నారు. ఎస్‌బీ డీఎస్పీ బాల సూర్యారావు, ఎస్ఐలు వెంకన్న, విశ్వనాథం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, కొండకొప్పాకలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంజీవయ్య జయంతి నిర్వహించారు. డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


సబ్బవరం న్యాయ విశ్వవిద్యాలయంలో...

సంజీవయ్య ఆదర్శప్రాయుడని కొనియాడారు. డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దామోదరం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్ఐ రమేష్, వీఆర్వో గణేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : దామోదరం సంజీయవ్య నేటి యువతకు ఆదర్శమని సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు అన్నారు. వర్సిటీలో శుకవారం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ దయానందమూర్తి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో కొలువైన పోలమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్టు మాజీ సర్పంచ్ అట్టా సన్యాసిఅప్పారావు తెలిపారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా కోరారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 1769 మంది హాజరు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు ఉదయం, మధ్యాహ్నం కలిపి మొత్తం 1769 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి సుజాత తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 695 మంది హాజరు కావాల్సి ఉండగా 682 మంది మాత్రమే వచ్చారన్నారు. మధ్యాహ్నం 1114 మందికి 1087 మంది హాజరయ్యారని వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రచారం

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ మండలంలోని గొర్లెవానిపాలేనికి చెందిన పర్యావరణ ప్రేమికుడు కుంభమేళాలో తన మిత్రులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కుంభమేళాకు గత ఆదివారం దుర్గాప్రసాద్ తన మిత్రులతో కలిసి ప్రయాగరాజ్‌కు వెళ్లారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలి అని చెబుతూ వారంతా కరపత్రాలను పంపిణీ చేసినట్టు ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అతని మిత్రులు సంతోష్, మురళీ, శ్రీను, కన్నబాబు, ఆదిత్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపురంలో పేకాట ఆడుతున్న ఇద్దరి అరెస్టు

కొత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం గోపాలపురం పంచాయతీ శివారున పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి శుక్రవారం దాడి చేయగా, పేకాట ఆడుతూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.1820 నగదును స్వాధీనం చేసుకున్న అనంతరం అరెస్టు చేశామన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

» రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపులో జిల్లా రవాణా శాఖాధికారి మనోహర్


సర్వీసులో ప్రమాదాలు చేయని డ్రైవర్ల సత్కార సభలో అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణ కలవారన్నారు. మిగిలిన ప్రైవేటు వాహనాలతో పోల్చితే ప్రమాదాలు జరిగే శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏవీ రమణ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు డ్రైవర్లు మాన్యువల్, డిజిటల్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. డీపీటీవో కె.పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర మాట్లాడుతూ జీరో ప్రమాదాలు లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సర్వీసులో ప్రమాదాలు చేయని డ్రైవర్లు అనకాపల్లి డిపో నుంచి ముగ్గుర్ని, నర్సీపట్నం డిపో నుంచి ముగ్గుర్ని, అనకాపల్లి జిల్లా స్థాయి నుంచి మరో ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేసి సత్కరించారు. నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంఎఫ్ మల్లేశ్వరరావు, నర్సీపట్నం ఎంఎఫ్ ఆచారితో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## 18న వాడచీపురుపల్లిలో వాలీబాల్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఈ నెల 18న ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 17వ తేదీ సాయంత్రం ఆరు గంటలలోపు తమ పేర్లను కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు 9440294143, 70364 03132 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

## పాఠశాలలకు బీరువాలు వితరణ


జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలకు బీరువాలను అందిస్తున్న బ్యాంక్ అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ప్రధాన ఉన్నత పాఠశాలలకు ఐడీబీఐ అనకాపల్లి బ్రాంచ్ అధికారులు శుక్రవారం బీరువాలను వితరణగా అందజేశారు. సీఎస్ఆర్ నిధులు రూ.లక్షా 25వేలు వెచ్చించి ఆరు బీరువాలను కొనుగోలు చేశారు. వీటిని గవరపాలెం ఉన్నత పాఠశాల, గవరపాలెం బాలికోన్నత పాఠశాల, పట్టణ బాలి కోన్నత పాఠశాల, మెయిన్‌రోడ్డులోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ ఫ్రాన్సిస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి బ్రాంచ్ మేనేజర్ డి.గంగాధరరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో దీర్ఘకాలంగా నెలకొన్న లోవోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని టీడీపీ నాయకుడు కూండ్రపు మధుతో పాటు పలువురు గ్రామస్థులు శుక్రవారం కోరారు. లోవోల్టేజీ కారణంగా విద్యుత్ ఉపకరణాలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. పంచాయతీలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ బోర్లు ఆధారంగానే కూరగాయల పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా వారు కోరారు.

# 'పీఎం సూర్యఘర్'తో ప్రజలకు, పర్యావరణానికి మేలు

» అధికారులు, బ్యాంకర్ల సమావేశంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

తుమ్మపాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ గొప్పు ప్రసాద్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇక్కడ జిల్లాలోని అన్ని శాఖల బ్యాంకు మేనేజర్లు, డీఆర్‌డీఏ మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, సోలార్ సంస్థల విక్రేతలు, ఈపీడీసీఎల్ అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా సబ్సిడీ అందిస్తున్నట్టు చెప్పారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం పొందే సౌకర్యం ఉందన్నారు. ఈ పథకానికి రుణాలు మంజూరులో బ్యాంకు అధికారులు ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు, పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. మిగులు విద్యుత్ తిరిగి సంస్థ కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా సోలార్ అమర్చుకున్న వినియోగదారులు పొదుపు చేసిన కరెంటు బిల్లులతో బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించడం ద్వారా,


సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ ప్రసాద్

రుణం తీర్చివేయడమే కాకుండా అనతికాలంలోనే ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి మాట్లాడుతూ సూర్యఘర్ పథకానికి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు, యూనిట్లు ఏర్పాటుకు విరివిగా రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణపై శిక్షణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా, ఇతర మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ అధికారులకు శుక్రవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్ అధికారి ఎ.రంగధామ్... మాదక ద్రవ్యాల నియంత్రణకు చట్టపరంగా వున్న అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణకు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావం వ్యక్తులు, సమాజంపై ఎంత తీవ్రంగా ఉంటుందో పోలీసులు తెలుసుకొని, వీటిని అరి కట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్‌మిశ్రా మాట్లాడుతూ, దర్యాప్తు పద్ధతులను మెరుగుపరిచి తీర్పుల శాతం


శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రంగధామ్

పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్ర మంలో డీఎస్పీలు ఎం.శ్రావణి, వి.విష్ణుస్వరూప్, పి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసులు, డి.మోహనరావు, ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ట్రెండ్ సెట్ చేశారు..

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు అమలు » అనంతగిరి మండలంలో రెండు నెలల కిందట పర్యటన

» అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడల నిర్మాణం.. పాఠశాలల్లో అభివృద్ధి పనులు

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మిగిలిన నేతల్లా ట్రెండ్‌ను ఫాలో కాకుండా ఆయనో చిత్తశుద్ధిగల నేతగా ట్రెండ్‌ను సెట్ చేశారు. రెండు నెలల కిందట అనంతగిరి మండలంలో ఆయన పర్యటించారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు సాగుతున్నాయి. దీంతో గిరిపుత్రుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి.**

అనంతగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చిన అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా మొదలవుతున్నాయి. ఆయనకు ఇచ్చిన ఏ వినతి కూడా ఊరకనే పోలేదు. సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు పడడంతో గిరిజనులు ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది. గిరిజనులకు మేలు జరుగుతుందంటే ఎంతదూరమైన వస్తానంటూ పవన్ మాట్లాడిన మాటలను గిరిపుత్రులు గుర్తుచేసుకుంటున్నారు. మారుమూల గ్రామాలకు రహదారులు లేక.. డోలీమోతలపై గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న పవన్ కల్యాణ్ డిసెంబరు 21వ తేదీన అనంతగిరి మండలం పినకోట పంచాయతీ మారుమూల బల్లగరువు గ్రామంలో పర్యటించారు. పెద్దఎత్తున రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మార్గమధ్యనున్న కొరపర్తి గ్రామాన్ని గిరిజనులు వినతి మేరకు సందర్శించి, సమస్యలను స్వయంగా పరిశీలించారు. మహిళల సమస్యలన్నీ ఓపికగా విన్నారు.. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనాల పరిస్థితి చూసి తీవ్ర స్థాయిలో స్పందించారు. వెంటనే కార్యాచరణకు దిగి ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రతిపాదనలు పంపగానే నిధులు మంజూరు చేసి, పనులు ప్రాంభించే దిశగా చర్యలు చేపట్టారు.

**కొరపర్తిలో....**

ప్రస్తుతం ఆయన ఇచ్చిన హామీ మేరకు జాతీయ ఉపాధిహామీ పథకంలో కొరపర్తి గ్రామంలో పాఠశాల చుట్టూ రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనితో పాటుగా సుమారు. రూ. 8 లక్షలతో పాఠశాల మరమ్మతులు, తదితర వాటికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు సాగుతున్నాయి. రూ.8 లక్షలతో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించనున్నారు. 300 మీటర్లతో డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలను కూడా పంపించారు. ట్రైబల్ వెల్ఫేర్‌శాఖ పర్యవేక్షణలో ఈ పనులు జరగనున్నాయి.. అలాగే బల్లగరువు, వేలగలపాడు గ్రామాల్లో గిరిజనులు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు చేరో రూ.15 లక్షల చొప్పున జాతీయ ఉపాధి పథకంలోని నిధులు మంజూరు చేశారు. అధికారులు భవనాలకు సంబంధించి, స్థలాలను పరిశీలించారు. ఇంకా పనులు ప్రారంభించాల్సి ఉంది. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పర్యవేక్షణలో చేపట్టనున్నారు.



కొరపర్తిలో శిథిలమైన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (ఫైల్‌ఫొటో)



కొరపర్తి అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణం



పాఠశాల వద్ద పనులు

## 1/70 చట్టంపై అపోహలు తొలగింపు హర్షణీయం

**ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజబాబు**



మాట్లాడుతున్న రాజబాబు

చింతపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు చట్టం పై స్పష్టత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సభాపతి చింతకాలయల అయ్యన్నపాత్రుడు భూబదలాయింపు చట్టాన్ని సవరిస్తేనేగాని గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి పెట్టుబడులురావని వ్యాఖ్యానించడంతో ఆదివాసీలు ఆందోళన చెందారన్నారు. ఈ చట్టం సవరిస్తారనే భయం గిరిజనుల్లో నెలకొన్నదన్నారు. దీంతో రెండు రోజుల బంద్‌కి ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చినట్టు చెప్పారు. వెంటనే స్పందించిన మంత్రి సంధ్యారాణి, ముఖ్యమంత్రి చంద్రబాబు భూబదలాయింపు చట్టాన్ని సవరించే ఆలోచన ప్రభుత్వానికిలేదని స్పష్టమైన ప్రకటన చేసి ఆదివాసీల ఆందోళనల ను తొలగించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ మండల కన్వీనర్ కొర్ర బలరామ్, కార్యదర్శి సిద్దార్థ మార్క్, సభ్యులు రీమెల పాల్, లకే రామచంద్రుడు, కొర్ర నారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలను మూసివేస్తే ఒప్పుకోం

» రోగులపేటలో ఆందోళన



ప్రాథమిక పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లితండ్రులు

పెదబయలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోగులపేటలో ప్రభుత్వం 177 జీవోను అనుసరించి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల ను మూసివేయాలని ప్రయత్నిస్తే సహించేదిలేదని గ్రామస్థులు హెచ్చరించారు. శుక్రవారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదుట ఈ మేరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేత సన్నిబాబు మాట్లాడుతూ... పెదబయలు మండల వ్యాప్తంగా 32 ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయటానికి ప్రభుత్వ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. 3,4,5 తరగతుల పిల్లలకు హై స్కూ ల్‌లో చేర్పించాలనే నెపంతో ఉన్న పాఠశాలలను తొలగించటం దారుణమని అన్నారు. యథావిధిగా గ్రామాల్లో పాఠశాలలను నడపాలని, లేకుంటే గిరిజనులతో భారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ కార్యదర్శి దేవరాజు, సీతగుంట ప సర్పంచి గంగాధరం, విద్యా కమిటీ చైర్మన్ రత్నకుమారి, ప్రభాకర్, కోటిబాబు, భీమన్న, హరిశ్చంద్రరావు, కృష్ణబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

» ఏటీడబ్ల్యూవో జయనాగ లక్ష్మి



విద్యార్థుల విద్యా ప్రగతి పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలు పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయనాగ లక్ష్మి అన్నారు. శుక్రవారం జీకేవీధి గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆమె, పది, తొమ్మిది తరగతుల విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్నాయన్నారు. ఆశ్రమ పాఠశాలల పదోవతరగతి విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులుకావడానికి గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక స్టడీ ప్రణాళికను అమలు పరుస్తోందన్నారు. పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు ప్రణాళికతో చదవాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారి ఆరోగ్యంపై హెచ్‌ఎం, వార్డెన్లు జాగ్రత్త వహించాలని కోరారు. వార్డెన్ కచ్చితంగా రాత్రి వసతి గృహంలో బస చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజం నాయుడు పాల్గొన్నారు.

## శ్రమదానంతో రహదారి మరమ్మతులు



రహదారి బాగు చేసుకుంటున్న గిరిజనులు

సీలేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ ఆకులూరు గ్రామం రహదారి మరమ్మతు పనులను శుక్రవారం గిరిజనులు సమష్టిగా చేపట్టారు. అధికారులకు ఈ రహదారి అభివృద్ధి చేయాలని కోరినా ఫలితంలేకపోయింది. దీంతో శ్రమదానంతో ఈ మార్గంలోని కొన్నిచోట్ల వర్షాలకు కొట్టుకొని వచ్చిన మట్టిని తొలగించి బాగు చేసుకున్నారు. ఈసందర్భంగా గిరిజనులు విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు గ్రామ రహదారి పూర్తిగా ధ్వంసమైందన్నారు. కనీసం ఆనవాళ్లు లేకుండాపోవడం వల్ల గ్రామానికి వాహనాలు వచ్చే పరిస్థితిలేదన్నారు. తాజాగా ప్రభుత్వం మంజూరుచేసిన గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, కంకర తరలించేందుకు అవస్థలుపడుతున్నామన్నారు.

## వాలీబాల్ పోటీల్లో పెదపాడు జట్టు విజేత



ఫైనల్స్ తలపడుతున్న జట్లు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్రా పంచాయతీ కేంద్రంలో నందీశ్వరుడి జాతర మహోత్సవాల భాగంగా ఏర్పాటు చేసిన మెగా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఆ పంచాయతీ సర్పంచ్ లకే అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన పంచాయతీ పరిధిలోని పెదపాడు గ్రామ వాలీబాల్ జట్టు 20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కోర్రా జీసీసీ జట్టుకు రూ.10 వేలు శనివారం బహుమతులు ప్రదానం చేస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు విజయ, ఉప సర్పంచి మాలిక్, వార్డు సభ్యులు రమేశ్, బుల్లిబాబు, సువర్ణ గ్రామస్థులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మెడికల్ కళాశాలల్లో ఖాళీల భర్తీ



కలెక్టర్ దినేశ్ కుమార్

పాడేరురూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 34 విభాగాలల్లో ఖాళీగా ఉన్న 244 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేయనున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. పోస్టులు అమ్ముకుంటున్నారన్న వదంతులు తన దృష్టికి వచ్చాయని, అలాంటి ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని హితవు పలికారు. పోస్టుల కోసం ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిపై చేసిన పోస్టులను రోస్టర్ అనుసరించి మాత్రమే భర్తీ చేయనున్నట్టు స్పష్టంచేశారు. పోస్టుల నియామకం, ధ్రువపత్రాల పరిశీలనకు నోడల్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థులు మార్క్‌లిస్టులు, అనుభవం తదితర అంశాల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకటిస్తామన్నారు. ఈ ప్రకారమే తుది జాబితా ప్రకటించి ఉద్యోగ భర్తీ చేయనున్నట్టు వివరించారు. ఉద్యోగ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే కళాశాల ప్రిన్సిపాల్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ‘సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేం’



కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులతో టీడీపీ నాయకులు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి): భూ బదలాయింపు చట్టాన్ని సవరించేదిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై గిరిజనులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి ముక్కలి మహేశ్ అన్నారు. శుక్రవారం టంగళ్లగొందిలో ఆయన గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయడంతోపాటూ జీవో 3 అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో గిరిజనులు ఆనందంగా ఉన్నారన్నారు. ఆదివాసీలకు భారీ సంఖ్యలో పక్కా గృహాలు, గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. టీఎన్ఎస్ఎఫ్, టీడీపీ నాయకులు చిన్నబ్బాయి, రాంబాబు పాల్గొన్నారు.

## సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించేందుకు మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులకు బదులుగా కింది స్థాయి సిబ్బంది హాజరు కావడంతో స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి దోహపడే సమావేశాలకు మండల స్థాయి అధికారులు కాకుండా కిందిస్థాయి ఎటువంటి సమాచారం లేకుండా హాజరు కాకుంటేఎలా అని ప్రశ్నించారు. గిరిజనులకు సేవ చేయాలన్న ఆలోచన ఉన్న అధికారులు మాత్రమే విధుల్లో ఉండాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా పంచాయతీల ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం ఇవ్వకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఎమ్మెల్యేతో పాటు పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడబ్ల్యూ ఇంజనీరింగ్ విభాగంలో సీసీ రోడ్లు మంజూరైనా, అంచనాల రూపకల్పనలో తాత్సారం చేస్తున్నారంటూ సర్పంచ్‌లు మండిపడ్డారు. టీడబ్ల్యూవో ఇంజనీరింగ్ అధికారుల తీరు అధ్వానంగా ఉందన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులను మైదాన ప్రాంత కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే బిల్లులు మార్చుకుంటున్నారన్నారు. జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన పనులు పూర్తికాక గ్రామాల ప్రజలు దాహంతో అల్లాడుతున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం పాడేరు హెడ్‌క్వార్టర్‌లో గుడివాడ, బక్కులపనుకు, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ప్రజలుఇదే దుస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఈవోపీఆర్డీ ఆర్‌పీఎస్.రమేశ్, ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్, సీడీపీవో ఝాన్సీరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సీహెచ్.సాయిరాఘవి, టీడబ్ల్యూజే ఈఈ దుర్గాప్రసాద్, ఆర్‌ఐ కూడా భాస్కరరావు ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. వెలుగు, జీసీసీ, టీడబ్ల్యూ (విద్య) ఈఆర్‌అండ్‌బీ, పశు వైద్య తదితర శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు.

## పటిష్ఠంగా పెసా చట్టం అమలు

» పరిశీలకుడు చిన్నారావు



శిక్షణకు హాజరైన కమిటీ ప్రతినిధులతో పరిశీలకుడు చిన్నారావు, ఎంపీడీవో

చింతపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా కమిటీలపై ఉన్నదని విశాఖపట్నంనుంచి వచ్చిన పరిశీలకుడు చిన్నారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, డ్వాక్రా మహిళలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన ఉంటే గ్రామ స్థాయిలో దీనిని పక్కాగా అమలు చేసే అవకాశం ఉంటుందన్నారు. పెసా గ్రామ సభకు విశిష్ట అధికారాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందాలంటే కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలనకు పెసా కమిటీలది కీలపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అనంతగిరి:** పెసా చట్టంపై ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు అన్నారు. మండల కేంద్రంలో అనంతగిరి, ఎగువశోభ, బొర్రా, కొండిబ, పైనంపాడు, వాలసీ, లంగుపర్తి, గుమ్మ, కొత్తూరు, కాశీపట్నం, పెదబిడ్డ, చిలకలగెడ్డ పంచాయతీల పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోని కార్యదర్శులు రామస్వామి, దేవా, ఎన్‌జీవో చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యూరు:** అవగాహనతోనే పెసా చట్టం పకడ్బందీగా అమలు సాధ్యమని పరిశీలకుడు రామనాథం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల పెసా కమిటీకు ఎన్నికైన ఉపాధ్యక్ష, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఎంటీటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేషబాబు ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ముంచంగిపుట్టు:** పెసా చట్టంపై కమిటీ సభ్యులకు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి అన్నారు. పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. పెసా చట్టం హక్కు లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ మురళీకృష్ణ, పంచాయతీ విస్తరణ అధికారి వి.చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రంగధామ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా, ఇతర మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ అధికారులకు శుక్రవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్ అధికారి ఎ.రంగధామ్... మాదక ద్రవ్యాల నియంత్రణకు చట్టపరంగా వున్న అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణకు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమన్నారు. మాదక ద్రవ్యాల ప్రభావం వ్యక్తులు, సమాజంపై ఎంత తీవ్రంగా ఉంటుందో పోలీసులు తెలుసుకొని, వీటిని అరి కట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్‌మిశ్రా మాట్లాడుతూ, దర్యాప్తు పద్ధతులను మెరుగుపరిచి తీర్పుల శాతం పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.శ్రావణి, వి.విష్ణుస్వరూప్, పి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసులు, డి.మోహనరావు, ట్రైనీ డీఎస్పీ ఎంవీకే చైతన్య, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

» తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ రాజేశ్‌కుమార్



అరకువారపు సంతల్లో తూనికరాళ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

అరకులోయ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అరకు వారపు సంతలో తూనికలు, కొలత శాఖ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ జి.రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కంట్రోలర్లు కె. రాధాకృష్ణ, ఎస్ఎంటి చిన్నమ్మలు, ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరి, సిబ్బంది సంతల్లోని కిరణా, పాన్‌షాపులతోపాటు ఇతర వ్యాపారులు తూకాల్లో వ్యత్యాసాలను తనిఖీ చేశారు. సీలు లేని కాటాలు వినియోగించిన వారిని గుర్తించి పది మందిపై కేసులు నమోదు చేసినట్టు రాజేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో 5 కేసులు సీలులేని కాటాలు వినియోగించి వ్యాపారులపై కాగా మరో 5 కేసులు దుకాణాల్లో నిర్దిష్ట ధర కన్నా ఎక్కువకు పాలు ప్యాకెట్లపై విక్రయించడంపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. వినియోగదారులకు కొనుగోలు చేసిన నిత్యావసర వస్తువులు, కాయగూరలను సక్రమంగా తూకం వేసి అందించాలన్నారు. ఈమేరకు వినియోగదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు. గిరిజన రైతులను మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పోస్టల్ పొదుపు ఖాతాలతో ఆర్థిక భరోసా

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 14 ( ఆంధ్రజ్యోతి): పోస్టల్ పొదుపు ఖాతాలతో ఆర్థిక భరోసా ఉంటుందని స్థానిక పోస్టల్ శాఖ ఎంవో ఎం.శ్రీను అన్నారు. మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పోస్టల్ శాఖలో పొదుపు ఖాతాలు, బీమాపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. పోస్టల్ శాఖ ద్వారా చేస్తున్న బీమాలు, వాటి వలన కలిగే ఉపయోగాలను గిరిజనులకు వివరించారు. పంచాయతీ స్థాయిలో నిత్యం అందుబాటులో ఉండే బ్రాంచి పోస్టాఫీసులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుమడ బ్రాంచి పోస్ట్ మాస్టర్ కొండబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలలతో పనిచేయిస్తే కేసులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు ఎవరైనా 18 ఏళ్లు నిండని చిన్నారులు పనిలో పెట్టు కుంటే చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి కార్మిక కమిషనర్ టి.సుజాత హెచ్చరించారు. పాడేరులో శుక్రవారం నిర్వహించిన తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఆటో మొబైల్స్ అండ్ స్పేర్స్ షాపులో బాలకార్మికుడు పనిచేస్తున్నట్లు గుర్తించి ఆ యజమానిపై కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులను పిలిచి ఇకపై బాలుడిని పనిలోకి పంపించవద్దని సూచిస్తూ బాబును తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్.సద్దు, అశోక్, చైల్డ్‌లైన్ సిబ్బంది అంబేడ్కర్ పాల్గొన్నారు.

## కూలి రేట్ల కోసం హమాలీల ఆందోళన




కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న జీసీసీ హమాలీలు

పాడేరురూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ మండలాల్లోని గొడౌన్‌ల వద్ద పనిచేస్తున్న హమాలీలకు కూలీరేట్లు పెంచుతూ జీవోను విడుదల చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట హమాలీలు నిరసన చేపట్టారు. ప్రభుత్వం స్పందించి జీసీసీ హమాలీలకు ఎగుమతి, దిగుమతి కూలీ రేట్లు పెంచాలన్నారు. హమాలీలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, 60 ఏళ్ల సర్వీస్ చేసిన హమీలకు గ్రాడ్యూటీ రూపంలో రూ. లక్ష ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు అందించారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

కొయ్యూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ఆయా కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహపడుతుందని హిమగిరి రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భగవాన్ సూచించారు. శుక్రవారం మండలంలో అంతాడలో సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలుఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లిఫ్ట రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణలో ప్రతిభ కనపర్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శ్రీనుబాబు, రేవతి, చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ శివ, స్థానిక ఎంపీటీసీ,సర్పంచ్ సత్యవేణి, చంద్రరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

## పన్నులు త్వరితగతిన వసూలు చేయండి

▸▸ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

గొలుగొండ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 14: ఇంటి పన్ను బకాయిలు త్వరితగతిన వసూలు చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో మేరీరోజీతో పాటు పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీలోగా ఇంటి పన్ను బకాయిల వసూళ్లు పూర్తిచేయాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

## కేశవస్వామి ఆలయంలో పుష్పాంజలి


పుష్పాలతో అలంకరించిన శ్రీదేవిభూదేవి సమేత కేశవస్వామి

చోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకేశవస్వామి ఆలయంలో కల్యాణ ఉత్సవాలు గురువారం అర్ధరాత్రి పుష్పాంజలితో ముగిశాయి. వారం రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు శ్రీదేవి భూదేవిసమేత కేశవ స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దంపతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 550మంది దంపతులకు తాంబూలాలు, మహా ప్రసాద వితరణ చేపట్టారు. అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, రామ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తమండలి సభ్యులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, ఉప్పల బాబు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ అందించాలి

జిల్లా ఖజానా అధికారి ఎల్‌వీ.సుభాషిణి


ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న సుభాషిణి

నర్సీపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లు నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని జిల్లా ఖజానా అధికారి ఎల్‌వీ.సుభాషిణి తెలిపారు. వార్షిక ఆడిట్ తనిఖీలలో భాగంగా శుక్రవారం నర్సీపట్నం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉండిపోయిన కార్యాలయం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ పెన్షనర్లు, విలేకరులతో మాట్లాడారు. నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయపోతే పెన్షన్లు ఆగిపోతాయని హెచ్చరించారు. నర్సీపట్నం సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలో 348 మంది సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉందన్నారు. సాంకేతిక సమస్య కారణంగా సబ్ ట్రెజరీ కార్యాలయం నూతన భవనం పనులు ఆగిపోయాయని, త్వరలో పనులు మొదలవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీవో గణేశ్, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.గజ్జాలమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అడవిరాజులబాబు పండుగ


మర్రిపాలెం పండుగలో కోలాటం చేస్తున్న మహిళలు

నాతవరం ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాతవరం, మర్రిపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం అడవిరాజులబాబు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే నాతవరం, మర్రిపాలెం గ్రామాల్లో భక్తులు కోలాటం, డప్పుల డాన్స్, శక్తివేషాలతో ఊరేగింపుగా అడవిరాజులబాబు వనంలోకి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. తోటలలో వంటలు చేసి భోజనాలు ఆరగించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టుకమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షులు శెట్టి లోవ, శెట్టి నానాజీ పాల్గొన్నారు.

## ఏపీవో ధ్రువీకరిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్రావు

చీడికాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల అనంతరం ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు ఏర్పాటుచేసి కనీసం గంట పనిచేస్తున్నట్టు ఏపీవో ధ్రువీకరణ పత్రం ఇస్తేనే జీతాల బిల్లు పెడతానని ఎంపీడీవో హేమసుందర్రావు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు సుస్థిర అభివృద్ధికి ఉపయోగపడేలా గుర్తించాలన్నారు. చోడవరం క్లస్టర్ ఏపీడీ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్చి 31లోగా లబ్ధిదారులకు వంద రోజులు పని పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ కామేశ్వరరావు, ఏపీవో అల్లు గంగునాయుడు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## పకడ్బందీగా తిరునాళ్ల ఏర్పాట్లు చేయాలి

రావికమతం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ మహాశివరాత్రి ఉత్సవాలు పకడ్బందీగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో వెంకన్నబాబు సూచించారు. శుక్రవారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశలోట మాట్లాడుతూ గతేడాది అనుభవాలను పరిగణనలోకి తీసుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవదాయ శాఖ ఈవో ఆశా కిరణ్మయి, మండల పరిషత్ ఏవో సీతారామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సారా బట్టీపై ఎక్సైజ్ దాడులు

3,180 కిలోల నల్లబెల్లం,
20 లీటర్ల సారా సీజ్

వ్యాపారితోసహా ముగ్గురి అరెస్టు


సారా తయారీ నిందితులతో ఎక్సైజ్ సీఐ, పోలీసులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, ఇందుకు అవసరమైన నల్ల బెల్లం విక్రయించే వ్యాపారులపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నవోదయం-2లో భాగంగా శుక్రవారం చోడవరం ఎక్సైజ్ సి.ఐ. కె.వి.పాపునాయుడు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. స్థానిక ఒడ్డుచింతల వారి కల్లాల సమీపంలో నాటు సారా బట్టీపై దాడి చేశారు. వరదపురెడ్డి నాయుడు, పైలా నాగరాజులను అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి నల్లం బెల్లం ఎక్కడ కొనుగోలు చేస్తున్నారో ఆరా తీశారు. అనంతరం స్థానికంగా వున్న ఒక గోదాములో తనిఖీలు నిర్వహించారు. 212 నల్లబెల్లం దిమ్మలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో దిమ్మ 15 కిలోల బరువు వుండడంతో మొత్తం 3,180 కిలోల బెల్లాన్ని సీజ్ చేశారు. నల్లబెల్లాన్ని నిల్వ/ విక్రయం చేస్తున్న వ్యాపారి సత్యవరపు గుప్తాజీని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సారా తయారైదారులైన వరదపురెడ్డి నాయుడు, పైలా నాగరాజు, సారా తయారీకి అవసరమైన నల్లబెల్లం విక్రయిన్న గుప్తాజీలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ, తమ సర్కిల్ పరిధిలో 28 గ్రామాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. నల్లబెల్లం విక్రయదారులకు ముందస్తు నోటీసులు ఇస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది అప్పారావు, రాంబాబు, రామునాయుడు, మహిళా సంరక్షక కార్యదర్శి రాణి పాల్గొన్నారు.

# పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడండి

▸▸ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా గంగయ్య


బీజేపీ మండల నూతన కార్యవర్గం ప్రతినిధులు

చీడికాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గుతున్న వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అందేలా చూడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా గంగయ్య కోరారు. జి.కొత్తపల్లి దేవాలయంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నపుడు వారి ప్రభుత్వ పథకాల్లో వారి కార్యకర్తలకే పెద్దపీట వేశారని, పేదలకు విస్మరించేవారని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ పథకాలు అందాలన్న సిద్ధాంతాన్ని కచ్చితంగా అమలుచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారన్నారు. 70 ఏళ్లు దాటిన వృద్ధులను ఆయుష్మాన్‌భారత్‌లో చేర్పించాలని ఆయన సూచించారు.

### ఏకగ్రీవంగా మండల నూతన కార్యవర్గం

ఈ సమావేశంలో పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాతాళం బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శిగా పల్లి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా పెంటకోట చినరామునాయుడు, చిరువూరి శివ, చిన్ని అప్పారావు, గాడి సత్యనారాయణ, పెంటకోట ఎరుకునాయుడు, కార్యదర్శులుగా చిరువూరి రాజేశ్వరి, నరవ దేముడుబాబు, ఎం.శ్రీను, కోశాదికారిగా జాజిమొగ్గల వెంకటరమణలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రెడ్డి కొండబాబు, చిరువూరి శివాజీరాజు, కొల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'పీఎం సూర్యఘర్'తో ప్రజలకు, పర్యావరణానికి మేలు

▸▸ అధికారులు, బ్యాంకర్ల సమావేశంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

తుమ్మపాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ గొప్పు ప్రసాద్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇక్కడ జిల్లాలోని అన్ని శాఖల బ్యాంకు మేనేజర్లు, డీఆర్‌డీఏ మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు, సోలార్ సంస్థల విక్రేతలు, ఈపీడీసీఎల్ అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా సబ్సిడీ అందిస్తున్నట్టు చెప్పారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం పొందే సౌకర్యం ఉందన్నారు. ఈ పథకానికి రుణాలు మంజూరులో బ్యాంకు అధికారులు ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు, పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. మిగులు విద్యుత్ తిరిగి సంస్థ కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా సోలార్ అమర్చుకున్న వినియోగదారులు పొదుపు చేసిన కరెంటు బిల్లులతో బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించడం ద్వారా, రుణం తీర్చివేయడమే కాకుండా అనతికాలంలోనే ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి మాట్లాడుతూ సూర్యఘర్ పథకానికి స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేసేందుకు, యూనిట్లు ఏర్పాటుకు విరివిగా రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

▸▸ మండలానికి ఒక పోలింగ్ కేంద్రం: ఆర్డీవో రమణ

నర్సీపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్డీవో వీవీ రమణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 1208 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. 12 మండలాలకు మండానికి ఒకటి చొప్పున 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఐదు సెక్టార్లు, ఐదు రూట్లు, ఐదు పోలీస్ రూట్లు, ప్రతీ మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించామని ఆయన తెలిపారు. ఎన్నికల సెక్టార్, రూట్ అధికారులకు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

## దుర్గానగర్‌లో వెండి వస్తువుల చోరీ

రావికమతం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌లోని చందక సత్తిబాబు ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆరు తులాల వెండి వస్తువులు, సాయిబాబా ముడుపుతో ఉన్న డబ్బుల హుండీ పట్టుకుపోయారు. దుర్గనగర్ చర్చికి సమీపంలో ఉన్న సత్తిబాబు ఇంటి తాళాన్ని కట్టర్‌తో కట్ చేసి దొంగతనానికి పాల్పడారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో హెచ్‌సీ వాసు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. చర్చ దగ్గర గల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. చోరీపై బాధితుడు నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎం.రఘువర్మ తదితరులు తెలిపారు.

## రెవెన్యూ రికార్డులు డీఆర్‌వో పరిశీలన


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు

గొలుగొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) వైఎస్ వీకేజీఎస్ఎల్. సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ రందర్భంగా రెవెన్యూ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలో దొర్లిన తప్పులపై వచ్చిన వినతులు, గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు పరిష్కారమయ్యాయా? లేదా? అనే అంశంపై రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా గుండుపాల రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను త్వరిగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. వివిధ రకాలైన ధ్రువపత్రాలు సకాలంలో లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీ రామారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తీర్ణతా శాతం పెంపునకు కృషి చేయండి

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని గురుకుల విద్యాలయాల ఉమ్మడి విశాఖ జిల్లాల కోఆర్డినేటర్ సి.ప్రభావతి సూచించారు. గురువారం రాత్రి తెనుగుపూడి గురుకుల కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన ప్రీ-ఫైనల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ నెల 15వ తేదీ నుంచి జరగబోయే పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధన కోసం విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ రఘు, వ్యాయామ ఉపాధ్యాయుడు తరుణేశ్వరరావు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లో తహసీల్దార్ తనిఖీలు

నాతవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాతవరం లక్ష్మీనరసింహ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం తహసీల్దార్ వేణుగోపాల్ తనిఖీలు చేశారు. పెట్రోల్ తగ్గించి బైక్‌లలో వేస్తున్నారని ఆరోపణలు రావడంతో ఈ తనిఖీ చేశారు. పెట్రోల్ నాణ్యతను కూడా పరిశీలించారు అనంతరం నాతవరం రేషన్‌షాపు నంబరు-12ను పరిశీలించి స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అలాగే నాతవరంలో నవ్య ఇండియాన్ గ్యాస్ గోడౌన్‌ను కూడా పరిశీలించారు. రేషన్ షాపులలో అవకతవకలు జరగకుండా తనిఖీలు చేపడుతున్నట్టు ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

## పెసాపై అవగాహనతోనే హక్కుల రక్షణ



పెసా అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రామనాథం

నాతవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పెసా చట్టంపై అవగహన ఉన్నప్పుడే గిరిజనులు తమ హక్కులను కాపాడుకోగలుగుతారని ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సరుగుడు, సుందరకోట, కెవి.శరభవరం, మాదవనగరం తదితర పంచాయతీల పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు, కార్యదర్శులకు శుక్రవారం పెసా చట్టంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఇటువంటి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసిందని, ఇవి గిరిజనులకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ చట్టంపై ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తదితరులు అవగహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఉషశ్రీ, పరిపాలనాధికారి పి.పార్థసారథి, ఈవోపీఆర్డీ మూర్తి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం

▸▸ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపులో జిల్లా రవాణా శాఖాధికారి మనోహర్


సర్వీసులో ప్రమాదాలు చేయని డ్రైవర్ల సత్కార సభలో అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపోలో రహదారి భద్రతా మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు క్రమశిక్షణ కలవారన్నారు. మిగిలిన ప్రైవేటు వాహనాలతో పోల్చితే ప్రమాదాలు జరిగే శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏవీ రమణ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు డ్రైవర్లు మాన్యువల్, డిజిటల్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. డీపీటీవో కె.పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర మాట్లాడుతూ జీరో ప్రమాదాలు లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సర్వీసులో ప్రమాదాలు చేయని డ్రైవర్లు అనకాపల్లి డిపో నుంచి ముగ్గుర్ని, నర్సీపట్నం డిపో నుంచి ముగ్గుర్ని, అనకాపల్లి జిల్లా స్థాయి నుంచి మరో ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేసి సత్కరించారు. నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంఎఫ్ మల్లేశ్వరరావు, నర్సీపట్నం ఎంఎఫ్ ఆచారితో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## 18న ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఈ నెల 18న ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఈనెల 17వ తేదీ సాయంత్రం ఆరు గంటలలోపు తమ పేర్లను కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేయనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు 9440294143, 70364 03132 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

## గాడిన పడిన చెరకు క్రషింగ్

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో లోపాలను సరిదిద్దాం

రైతులు యథావిధిగా చెరకు సరఫరా చేయాలి

ఎండీ సన్యాసినాయుడు



చోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో యంత్రాల పరంగా లోపాలు సరిదిద్ది, క్రషింగ్‌లో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టినందున రైతులు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసి సహకరించాలని ఎండీ వి.సన్యాసినాయుడు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సీజన్‌లో బాయిలర్, టర్బైన్‌లలో ఏర్పడిన సమస్యల కారణంగా క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడి రైతులు ఇబ్బందిపడిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే సమస్యలను గుర్తించి, లోపాలను సరిదిద్ది క్రషింగ్ గాడిలో పడేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఫ్యాక్టరీలో రెండు బాయిలర్లను బుధవారం నాటికే వినియోగంలోకి తీసుకుని వచ్చామని, చెరకు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రషింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఫ్యాక్టరీలో అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుంటూ, నైపుణ్యం కలిగిన కార్మికులతో క్రషింగ్ మెరుగునకు చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. రైతులు అధైర్యపడకుండా గతంలో మాదిరిగానే ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేయాలని కోరారు. వచ్చే సీజన్‌కు చెరకు నాట్లు ప్రారంభించాలని, ఫ్యాక్టరీ భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని ఎండీ సన్యాసినాయుడు విజ్ఞప్తి చేశారు.

## పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలి

చీడికాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకానికి రైతులంతా ముందుకు రావాలని చోడవరం క్లస్టర్ ఏపీడీ బండారు శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అప్పలరాజుపురం, ఖండివరం గ్రామాల్లో ఉపాధి వేతనదారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి గొయ్యిలు తవ్వి మొక్కలు నాటడం, తడపడం, సంరక్షణ తదితర అన్ని పనులను ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందన్నారు. ప్రతి రోజూ వేతనదారులు ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ పనిచేసి రూ.300 వచ్చేలా చూసుకోవాలన్నారు. అలాగే నీటి కుంటలు, ఇంకుడు గొయ్యిలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ కె.శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు లెక్కల సత్యవతి, మోసూరి ఏసు తదితరులు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ పరిశీలన చేయించుకోండి

లేనిపక్షంలో పింఛన్ నిలిపివేత: ఎంపీడీవో

మాడుగుల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్‌లను అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రిలో పరిశీలన చేయించుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అర్హత లేనప్పటికీ నకిలీ సదరం సర్టిఫికెట్‌లను చేయించుకుని కొందరు పింఛన్‌లు పొందుతుండడంతో సదరం సర్టిఫికెట్లు ఏరివేతకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పింఛన్ పొందుతున్నవారికి షెడ్యూల్ ప్రకారం అర్హత నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్టు చెప్పారు. పింఛన్‌దారులు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. తనిఖీలు చేయించుకోలేని పింఛన్‌లను నిలిపి వేయనున్నట్టు ఆయన హెచ్చరించారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందంజలో గ్రామీణులు

దేవరాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడంలో గ్రామీణ ప్రాంతాలు ప్రజలు ముందు ఉంటారని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ముషిడిపల్లి దుర్గాలమ్మ ఒడ్డు పండుగ సందర్భంగా గ్రామ దేవతను శుక్రవారం దర్శించుకొని పూజలు చేశారు. ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, నాయకులు కేవీ.వీరమణ, బూరె బాబూరావు, మతల దేవుడమ్మ, బొడ్డు లక్ష్మి పాల్గొన్నారు.

### 25లోగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చీడికాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25లోగా రైతులందరూ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కృష్ణవేణి కోరారు. జైతువరం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధార్, బ్యాంకుకు లింకు ఉన్న ఫోన్ నంబరు తీసుకువచ్చి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం 11 అంకెల గల గుర్తింపు కార్డులను ఇస్తామన్నారు. దీని ద్వారా పీఎం కిషాన్ నగదు జమ అవుతుందన్నారు. మండలంలో ఇంతవరకు 1650 మంది రైతులు నమోదు చేసుకున్నారని ఆమె తెలిపారు.

### భూ ఆధార్ నమోదు తప్పనిసరి

మాకవరపాలెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ అధికారి చిరంజీవి తెలిపారు. శుక్రవారం లచ్చన్నపాలెం గ్రామంలో భూ ఆధార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 1150 మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. రైతులు తమ వివరాలతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన చెప్పారు.

### 1850 మందికి ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు

రోలుగుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1850 మందికి భూ ఆధార్ కార్డులు జారీ చేసినట్టు వ్యవసాయాధికారి విజయలక్ష్మి తెలిపారు. రోలుగుంట, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు గ్రామాల్లో నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. భూమి ఉన్న ప్రతీ రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ పొందుతున్న రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బీ, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నంబర్‌తో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

### చురుగ్గా బోరు మరమ్మతు పనులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బోర్ల మరమ్మతు పనులు చురుగ్గా చేపడుతున్నారు. లింగంపేట, చోద్యం, ఏఎల్‌పురం గ్రామాల్లో శుక్రవారం ఈ పనులను ఎంపీడీవో మేరీరోజ్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసిన తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సర్పంచులు తోకల సంతోష్‌కుమార్, పందిరి సత్యం నాయుడు, ఎ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జూలో చలువ పందిళ్లు

## వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించే చర్యలు

- జంతువులు, పక్షులు సంరక్షణకు ప్రణాళిక
- తాటాకులు, రెల్లిగడ్డితో నీడ కల్పన
- వట్టివేరు చాపలు, స్ప్రింకర్లు ఏర్పాటు
- ఎలక్ట్రోలేట్స్, గ్లూకోజ్ ద్రావణం అందించేందుకు సిద్ధం

జింకల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిర్లు



విశాఖపట్నం/ఆరిలోవ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): **వేసవి వచ్చేసింది...ఎండ తీవ్రతకు మనుషులే కాదు...జంతువులు, పక్షులు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. సున్నితమైన జీవుల పరిస్థితి మరీ ఇబ్బందిగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జంతువులు, పక్షులు, ఇతర జీవులకు వేసవితాపం నుంచి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అవి ఉండే ఎన్‌క్లోజర్లలో తాటాకులు, రెల్లిగడ్డితో చలువ పందిళ్లు, వట్టివేరు చాపలు ఏర్పాటు చేస్తున్నారు. వేడి రాకుండా స్ప్రింకర్లతో నీటిని వెదజల్లే ప్రక్రియ ప్రారంభించారు.**

ప్రతి వేసవిలానే ఈ ఏడాది అప్పుడే జంతు ప్రదర్శనశాలలో వేసవి సంరక్షణ ప్రణాళికలు అమలుచేస్తున్నారు. ప్రస్తుతానికి రూ.ఐదు లక్షల ఖర్చుతో పలు రకాలుగా ఉపశమన చర్యలు చేపడుతున్నామని జూ క్యూరేటర్ మంగమ్మ పేర్కొన్నారు. వేసవిలో జంతువులు,పక్షులు, ఇతర జీవుల రక్షణకు ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.



జూ సందర్శనకు వచ్చే పర్యాటకులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన చలువ పందిరి

### జూలో 900 రకాల జీవులు

జూలో జంతువులు, పక్షులు, పాములు మొదలైనవి సుమారు 900 రకాలున్నాయి. వాటిలో కొన్ని సున్నితమైనవి, మరికొన్ని క్రూరమృగాలు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఏనుగులు, అడవిదున్నలు, జింకలు, జిరాఫీ, కోతులు, ఇతర జంతువులు ఉండే ఎన్‌క్లోజర్స్ వద్ద ఇప్పటికే తాటాకులు, రెల్లిగడ్డి పందిళ్లు వేయగా మిగిలినవి ఈనెల 25వతేదీ నాటికి పూర్తిచేస్తారు. ఎన్‌క్లోజర్లకు వట్టివేరు చాపలు అమర్చుతారు. పగటిపూట జంతువులు పందిళ్ల కింద సేదదీరుతాయి. రాత్రిపూట ఎన్‌క్లోజర్లలోనికి వెళ్లిపోతాయి. ఎన్‌క్లోజర్‌లో స్రింకర్లతో నీటిని స్ప్రే చేస్తున్నారు. ఫ్యాన్లు ఏర్పాటు చేయనున్నారు. చింపాంజి ఉండే ఎన్‌క్లోజర్‌లో కూలర్ పెట్టాలని నిర్ణయించారు. ఎన్‌క్లోజర్లకు కూల్‌రూఫ్ వేయనున్నారు. ఎండ తీవ్రత నుంచి రక్షణకు ఈ చర్యలతోపాటు వేసవితాపాన్ని తట్టుకుని, దాహార్తి తీర్చేలా జంతువులు, పక్షులకు ఎలక్ట్రొలైట్స్, గ్లూకోజ్ వంటి ద్రావకాలు అందించనున్నారు. వేసవి ప్రభావంతో అస్వస్థతకు గురైన జింకలకు సెలైన్లు పెడతారు. అడవిదున్నలు, ఏనుగులు, ఇతర పెద్ద జంతువులకు నీటిలో ఒక లీటరుకు 30 గ్రాముల ఎలక్ట్రోలైట్స్ కలిపి అందించనున్నారు. అవసరమైతే విటమిన్స్‌తో కూడిన ద్రావణాలు ఇచ్చేలా ప్రతిపాదించారు. ద్రావకాలతో పాటు ప్రతి రోజూ ఇచ్చే ఆహారంలో మార్పులు చేయనున్నారు. ఆహారం ముద్దగా చేసి ఉండలుగా అందించనున్నారు. చలువ చేసే ఆహారం ప్రధానంగా కీరదోశ సరఫరా చేస్తారు. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ ప్రతి రోజు ఉదయం 7.30 నుంచి ఎనిమిది వరకు సాయంత్రం 4.30 గంటలకు ఎలక్ట్రొలైట్స్ సరఫరాకు నిర్ణయించారు. వేసవిలో పక్షులపై మరింత ఎండ ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో పక్షులను ఉంచే ఎన్‌క్లోజర్లలో వట్టివేరు చాపలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ నుంచి వర్షాకాలం ప్రారంభయ్యే వరకు ఉదయం, సాయంత్రంతోపాటు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఎక్కువ శాతం ద్రావకాలు ఇవ్వాలని ప్రతిపాదించారు.



ఎన్‌క్లోజర్‌పై చల్లదనానికి నీళ్లు చిమ్ముతున్న సిబ్బంది



లవ్‌బర్డ్స్ ఎన్‌క్లోజర్ వద్ద ఏర్పాటు చేసిన తాటాకుల పందిరి

### వేసవి ప్రణాళికలు సిద్ధం



వేసవి నేపథ్యంలో జూలో అన్ని ప్రాణుల రక్షణకు చర్యలు తీసుకున్నాం. సుమారు రూ.5 లక్షలతో కార్యక్రమాలు అమలుచేస్తున్నాం. కొన్నిచోట్ల ఎన్‌క్లోజర్లలో తాటాకులు, రెల్లిగడ్డితో పందిళ్లు వేశాం. జంతువులు తిరుగాడే ప్రాంతాల్లో స్రింకర్లతో నేల చల్లగా ఉండేలా నీటిని స్ప్రే చేస్తున్నాం. ఈనెల 25 నాటికి పనులు పూర్తవుతాయి. ఆహారం సరఫరాలో జాగ్రత్తలు తీసుకుంటాం. వైద్యుల పర్యవేక్షణలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించి జీవులు వడదెబ్బకు గురైతే గుర్తించి ఉపశమనం కల్పించేలా బృందాలను నియమించాం. వర్షాలు కురిసే వరకు రక్షణ చర్యలు తీసుకుంటాం.

- మంగమ్మ, క్యూరేటర్, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల

# చిన్నారుల్లో క్యాన్సర్



## ఉత్తరాంధ్రలో ఏటా వ్యాధిబారిన వందలాది మంది...

- సకాలంలో గుర్తించడం కీలకం
- మెరుగైన వైద్య సేవలతో కోలుకునే అవకాశం
- నేడు వరల్డ్ చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

**క్యాన్సర్ కోరల్లో చిక్కుకుని చిన్నారులు అల్లాడుతున్నారు. గతంతో పోలిస్తే దీని బారినపడుతున్న వారి సంఖ్య పెరిగింది. ఉత్తరాంధ్రకి చెందిన వందలాది మంది వివిధ రకాల క్యాన్సర్లబారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెద్దలతో పోలిస్తే చిన్నారుల్లో క్యాన్సర్ల తీవ్రత తక్కువగా ఉండడం, సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడంతో రికవరీ రేటు అధికంగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్ల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఫిబ్రవరి 15న చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు.**

ఏటా లక్షలాది మంది చిన్నారులు వివిధ రకాల క్యాన్సర్ల బారినపడుతున్నారు. దేశంలో ప్రతి ఏటా కొత్తగా 70 వేల కేసులు నమోదవుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అవగాహన లేకపోవడం, వ్యాధిని గుర్తించినా మెరుగైన వైద్య సేవలను అందించలేకపోవడం తదితర కారణాలతో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. దీంతో అనేక సంస్థల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో చైల్డ్‌హుడ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు. అమెరికన్ చిల్డ్రన్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ అనేక దేశాల్లోని సంస్థలతో కలిసి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తోంది.

### ఈ కేన్సర్లు అధికం..

ఉత్తరాంధ్ర ప్రాంతంలోని చిన్నారులకు బ్లడ్, బ్రెయిన్ ట్యూమర్స్, సాఫ్ట్ టిష్యూ, లుకేమియా (తెల్ల రక్త కణాలకు వచ్చే క్యాన్సర్), మెదడు, పొట్టలో (న్యూరో బ్లాస్టోమా) వంటి క్యాన్సర్లు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటితోపాటు కిడ్నీ, లింఫోమా (గ్రంధులకు సంబంధించిన), రెటినో బ్లాస్టోమా (కంటిలో తెల్లగా వచ్చే), జర్మ్‌సెల్ ట్యూమర్స్ (అండాలకు, వృషణాలకు వచ్చేవి) కనిపిస్తున్నాయి. అధికశాతం జన్యుపరమైన కారణాలేనని పేర్కొంటున్నారు. నగర పరిధిలోని పది ఆస్పత్రుల్లో ఏటా సుమారు 1,200 కొత్త క్యాన్సర్ కేసులను గుర్తిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

### 90 శాతం కోలుకునే ఛాన్స్..

చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను సకాలంలో గుర్తిస్తే 80 నుంచి 90 శాతం నివారణ సాధ్యమేనని నిపుణులు చెబుతున్నారు. కీమో థెరపీ, సర్జరీ, అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే రేడియేషన్ థెరపీ ఇస్తారు. కొన్ని క్యాన్సర్లకు టార్గెటెడ్ థెరపీతో చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది.

### లక్షణాలతో గుర్తించే చాన్స్..

చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను కొన్ని లక్షణాలను బట్టి ప్రాథమిక దశలో గుర్తించే వీలుంది. ఫిట్స్ తలనొప్పి వచ్చి వాంతులు కావడం, బ్లడ్ లేకపోవడం, మెడ, చంకలో గెడ్డలు, కారణం తెలియకుండా తరచూ జ్వరం, మజిల్స్‌లో ట్యూమర్లు, కడుపులో గడ్డలు, నడుస్తుండగా బ్యాలెన్స్ తప్పడం లాంటి లక్షణాలుంటే అనుమానించాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. 20 ఏళ్లలోపు క్యాన్సర్ బారినపడినా చైల్డ్‌హుడ్ క్యాన్సర్‌గా చికిత్స చేస్తారు.

### గుర్తించడమే అత్యంత కీలకం



చిన్నారుల్లో ఏ క్యాన్సర్ అయినా సకాలంలో గుర్తించడం కీలకం. రికవరీ రేటు అధికం. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఏటా 100 నుంచి 120 వరకు చిన్నారుల్లో వచ్చే రకరకాల క్యాన్సర్లు చూస్తుంటాం.క్యాన్సర్ నుంచి కోలుకునే చిన్నారులు ఆ తరువాత సాధారణ జీవితాలను గడపగలరు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ వై.విజయ ఆదిత్య, క్యాన్సర్ వైద్య నిపుణులు, హెచ్‌సీజీ పినాకిల్ కేన్సర్ ఆస్పత్రి

## దేవీపురంలో ఎంఎం కీరవాణి

- శ్రీచక్ర ఆలయాన్ని సందర్శించిన సంగీత దర్శకులు



శ్రీచక్ర ఆలయం వెలుపల కీరవాణి, కాంచి

సబ్బవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి శుక్రవారం దేవీపురంలోని రాజరాజేశ్వరి సహస్రాక్షి అమ్మవారిని, దత్త గురుపీఠం, కామాఖ్య శక్తిపీఠం, మధుర మీనాక్షి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వేద పాఠశాల విద్యార్థులు ఆయనను కలిశారు. మాట్లాడారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ, దేవీపురంలోని శ్రీచక్ర ఆలయ నిర్వాహకులు సనాతన ధర్మాన్ని, సంస్కృతిని పరిరక్షించేలా కృషి చేయడం గొప్ప విషయమని అన్నారు. ఆయన వెంట రచయిత, నటుడు ఎస్.ఎస్.కాంచి, గురుపత్ని అన్నపూర్ణమ్మ, శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమ వున్నారు.



## ఇంటర్, టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైల్వేగేట్లు వున్న గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగానే బయలుదేరేటట్టు చూడాలని తెలిపారు. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని, దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీకి సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, పరీక్ష అనంతరం జవాబు పత్రాల బండిల్స్ పంపడానికి తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని ఆమె కోరారు.

జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బి.సుజాత పరీక్షల వివరాలు తెలియజేస్తూ.. మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దేవరాపల్లి, కృష్ణాదేవిపేట పరీక్షా కేంద్రాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులను కోరారు. డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 400 పాఠశాలలకు చెందిన బాలురు 10,435 మంది, బాలికలు 10,339 మంది.. మొత్తం 20,774 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరికి 107 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో జి.రవికుమార్, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మంచుతో మామిడి, జీడిమామిడికి తెగుళ్లు

- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి సూచన



వంగలిలో మామిడి రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జి.ప్రభాకరరావు

సబ్బవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మంచు దట్టంగా పడుతుండడంతో మామిడి, జీడిమామిడి తోటలను తెగుళ్ల ఆశించే అవకాశం వుందని, రైతులు నిరంతరం తోటలను పరిశీలిస్తూ తెగుళ్ల నివారణకు తగిన మందులను పిచికారీ చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు సూచించారు. ఆయన మండలంలోని వంగలి గ్రామంలో శుక్రవారం పర్యటించి మామిడి, జీడిమామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తేనె మంచు పురుగు ఆశిస్తే.. సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పది లీటర్ల నీటికి థయోమిథాక్సమ్ నాలుగు గ్రాములు లేదా ఫిప్రోనిల్ 20 ఎం.ఎల్. లేదా ఇమిడాక్లోప్రిడ్ నాలుగు ఎం.ఎల్. కలిపి చెట్ల ఆకులు, కొమ్మలు తడిచేరలా పిచికారీ చేయాలని చెప్పారు. బూడిద తెగులు ఆశిస్తే హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి రెండు ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. బంక తెగులు రాకుండా ట్రైకో డెర్మా పొడిని నేలపై చల్లాలని, పిందెలు బఠానీ సైజులో ఉన్నప్పుడు ప్లానోఫిక్స్ మందును పది లీటర్ల నీటికి రెండు ఎం.ఎల్. చొప్పున కలిపి స్ప్రే చేయాలని సూచించారు. వీటితోపాటు ఏ రకమైన తెగులు ఆశించినప్పటికీ స్థానిక ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి, వారు సూచించిన మందులను చల్లాలని అన్నారు. ఆయన వెంట ఉద్యాన అధికారి ఆర్.కిరణ్మయి, వీహెచ్‌ఏ పి.ప్రభావతి, రైతులు కోట్ని అమ్మతల్లినాయుడు, జెట్టి సోమునాయుడు పాల్గొన్నారు.

## జంపపాలెం రేషన్ డీలర్‌పై వేటు

... 5వ పేజీ తరువాయి

చేసిన 30వ నంబరు రేషన్ డిపోను తనిఖీ చేశారు. బస్తాల్లో ఉన్న బియ్యాన్ని జేసీ పరిశీలించారు రాళ్లు, ఎలుకల వ్యర్థాలు ఉన్న బియ్యాన్ని ఎందుకు పంపిణీ చేశారంటూ రేషన్ డిపో డీలర్ సతీశ్‌కుమార్‌ను ప్రశ్నించారు. మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసిన దేవకీనాయుడుతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యంలో రాళ్లు, ఇతర వ్యర్థాలు ఎంతకాలం వస్తున్నాయని ఆయనను అడిగారు. రేషన్ బియ్యం సరఫరా, పంపిణీని ఎందుకు పర్యవేక్షించడం లేదంటూ పౌరసరఫరాల అధికారులపై ఆమె మండిపడ్డారు. రేషన్ బియ్యంలో రాళ్లు ఉన్నట్లు 12వ తేదీన ఫిర్యాదు వస్తే శుక్రవారం షోకాజ్ నోటీసు ఇవ్వడం ఏమిటని గట్టిగా ప్రశ్నించారు. 30వ నంబరు రేషన్ డిపో డీలర్ సతీశ్‌కుమార్, ఎండీయూ వాహనం ఆపరేటర్ పిల్లా నాగేంద్రలను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు.



పౌరసరఫరాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ జాహ్నవి

## క్రైం... crime news

### వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి. ఇంటికి సంబంధించిన దస్తావేజుల కోసం బొగ్గారపువీధికి చెందిన శ్రీధరాల పైడిశెట్టి ఒత్తిడి చేయడంతో లోకావారివీధికి చెందిన దొమ్మేటి వెంకట సత్యనారాయణ(57) ఈ నెల 11వ తేదీన గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరుసటి రోజు రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుని భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యనారాయణ ఆత్మహత్యకు శ్రీధరాల పైడిశెట్టి కారణంగా భావించి శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

### కూరగాయల వ్యాన్ బోల్తా

కొత్తూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కొప్పాక వద్ద జాతీయ రహదారిపై కూరగాయల వ్యాన్ బోల్తా పడింది. తుని నుంచి గాజువాకకు కూరగాయల లోడుతో వెళుతున్న వ్యాన్ శుక్రవారం తెల్లవారుజామున డీఈవో కార్యాలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొన్నది. దీంతో వ్యాన్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని డివైడర్‌పై బోల్తా పడింది. ఈ సమయంలో వ్యాన్‌లో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి వున్నారు. ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది, రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### వివాహిత ఆత్మహత్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భర్త వికృత చేష్టలు, లైంగిక వేధింపులను తట్టుకోలేని వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన విశాఖలోని గోపాలపట్నం ప్రాంతం నందమూరి నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక ప్రాంతానికి చెందిన వసంత (24)కు, నందమూరి నగర్‌కు చెందిన చిక్కాల నాగేంద్రబాబుకు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే నాగేంద్రబాబు పెళ్లైనప్పటి నుంచి భార్యను వేధించేవాడు. ఆమెకు అసభ్యకర వీడియోలు చూపిస్తూ, వికృత చేష్టలకు పాల్పడేవాడు. లైంగిక వాంఛను ప్రేరేపించే మాత్రలు తీసుకువచ్చి, వాటిని వేసుకోవాలని తీవ్రంగా ఒత్తిడి చేసేవాడు. దీంతో దంపతుల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గురువారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. రాత్రి పది గంటల సమయంలో నాగేంద్రబాబు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. భర్త చేష్టలకు విసిగిపోయి, తీవ్ర మనస్తాపానికి గురైన వసంత గదిలోకి వెళ్లి సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. దంపతుల మధ్య పెద్ద గొడవ జరగడాన్ని గమనించిన సమీప ప్రాంతాల వాసులు నాగేంద్రబాబు బయటకు వెళ్లిపోయిన తరువాత అతడి ఇంట్లోకి వెళ్లారు. గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వసంత ఉరివేసుకుని వేలాడుతుండడాన్ని గమనించి, వెంటనే ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి వెంకటరమణ శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అతడి వద్ద కామవాంఛను ప్రేరేపించే మాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 96.00 |
| లైవ్ ధర | 116.00 |
| విత్ స్కిన్ | 202.00 |
| స్కిన్ లెస్ | 212.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 465 |
| విజయనగరం | 469 |
| శ్రీకాకుళం | 469 |